క్లుప్తంగా

కృష్ణా వర్సిటీ బాస్కెట్‌బాల్ చాంపియన్ కేబీఎన్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ (పురుషుల) పోటీల్లో కేబీఎన్ కళాశాల ఉత్తమ ప్రతిభను కనబరిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కేరళ విశ్వవిద్యాలయం నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఆర్.రఘువంశీ, పి.సందీప్‌కుమార్, ఎ.సందీప్, పి.హరీష్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావును కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపల్స్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ అభినందించారు. కళాశాల పీజీ డైరెక్టర్ ఎస్ వెంకటేష్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన సీహెచ్ తాన్య, వర్షిక, ప్రాజ్ఞవి, హిరణ్య, వెన్నికలతో పాటు పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

3న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 2023–24 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షను డిసెంబర్ మూడో తేదీన నిర్వహించినున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. మూడో తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ ఉపకారవేతన పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకొని విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందే విధంగా చూడాలని సూచించారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక వికాసం

పటమట(విజయవాడతూర్పు): క్రీడల వల్ల విద్యార్థులకు మానసిక వికాసం కలుగుతుందని ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ భానుమూర్తి అన్నారు. స్టెల్లా కళాశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఇంటర్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్‌లో అండర్ 14 బాలుర, బాలికల నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భానుమూర్తి మాట్లాడుతూ గెలుపోటములు సహజమైనవప్పటికీ, ఓటమి నుంచి గెలుపును అందుకోవటం అలవర్చుకోవాలని సూచించారు. డీఈవో రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను తప్పనిసరి చేశామని, విద్యార్థి స్థాయి నుంచి పోటీతత్వం అలవడటానికి క్రీడలు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు అన్నిరకాల పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో తూర్పు గోదావరి, బాలికల విభాగంలో విశాఖ జిల్లాలు ప్రథమ స్థానం పొందగా అండర్ 19 కేటగిరీలో బాలికలు, బాలుర విభాగంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

సాయిమహేష్‌కు నగర బహిష్కరణ పొడిగింపు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఉప్పుగల్ల సాయిమహేష్ అలియాస్ నాని నగర బహిష్కరణ పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సాయి మహేష్ వివిధ నేరాలకు సంబంధించి అరెస్ట్ అయ్యి, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన అనంతరం కూడా తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగజేస్తున్నందున కమిషనరేట్ పరిధి నుంచి బహిష్కరించటమైనది. సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కల్పిస్తూ, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణ చేయడం, గంజాయి సేవించి అల్లర్లకు పాల్పడుతున్నందున బహిష్కరణ మరో నెలలు పొడిగించారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వెలంపల్లి



అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్‌లో వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మీ, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీతో కలిసి పర్యటించారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో స్థానికంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలిపే బోర్డును మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు డివిజన్‌లో పర్యటించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార వర్గాలు అధికంగా ఉన్న ఈ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. దాదాపుగా డివిజన్‌లో ఉన్న రహదారులన్నీ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. అలాగే డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వాటితో పాటుగా పురాతన విద్యుత్ లైన్లను తొలగించి కోటి రూపాయాల వ్యయంతో నూతన లైన్లు వేశామన్నారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, స్థానిక నాయకులు గ్రంధి రమేష్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదలకు మంచి చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రాంత పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే చంద్రబాబు దుర్మార్గంగా అడ్డుకున్నారన్నారు. కోర్టులో తప్పుడు కేసులు వేసి పేదలకు ఇళ్లు రాకుండా చూస్తున్నారన్నారు. తప్పకుండా న్యాయం గెలుస్తుందన్నారు. పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు కట్టించేంత వరకు ప్రభుత్వం వారికి తోడుగా ఉంటుందన్నారు. మంగళవారం భవానీపురం 40 డివిజన్ 121 వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు.



సచివాలయంలో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అనంతరం సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగున్నరేళ్ల జగన్ పాలనకు, 14 ఏళ్ల చంద్రబాబు పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

తన బావ చంద్రబాబు కళ్లలో ఆనందం కోసమే బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి తపన పడుతున్నారని వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రభుత్వాన్ని విమర్శించే ముందు కేంద్రంలోని బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల అంజనేయ రెడ్డి,మనోజ్ కొఠారి,గౌస్ మొహిద్దీన్, యశోధర్, కేసరి కృష్ణారెడ్డి,గ్రంది బుజ్జి, తనుబుద్దీ చంద్రశేఖర్ రెడ్డి, పాలిమెట్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ ముఖ హాజరు తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. వారికి నిర్దేశించిన సమయంలో విధులకు హాజరవుతూ, రోజుకు మూడు సార్లు ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలని సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరుపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, విజిలెన్స్ చేయడానికి ఒక కార్యక్రమం అధికారి నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. వైద్య సిబ్బంది అందరూ సీసీఏ నిబంధనలకు లోబడి పనిచేయాలని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అంతేకాకుండా ఆరోగ్య కార్యక్రమాలను సమన్వయంతో అమలుచేసి, జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, గణాంక అధికారి ఎస్.లక్ష్మీజీ, అకౌంట్స్ అధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



డివిజన్‌లో భద్రత చర్యలపై బ్రాంచ్ అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో భద్రత చర్యలపై మంగళవారం డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో పలు బ్రాంచ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టిన భద్రత చర్యలు, రైళ్ల నిర్వహణ, సమయపాలన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ట్రాక్‌ల స్క్రీనింగ్, లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు, ట్రాక్‌ల పునరుద్ధరణ తదితర ముఖ్యమైన భద్రత అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్‌ల పని గంటల నియంత్రణపై పూర్తిగా పర్యవేక్షణ చేయాలని బ్రాంచ్ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణపై డివిజన్‌లో చేపట్టిన పది రోజుల పాటు ప్రత్యేక సెఫ్టీ డ్రైవ్‌లో గుర్తించిన లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్‌లో చేపట్టిన రోలింగ్ బ్లాక్ కారిడార్ పనుల పురోగతిపై చర్చించారు. అదే విధంగా ఏసీ కోచ్‌లలో స్మోక్ డిటెక్షన్ సిస్టం, ప్యాంట్రీ, పవర్ కార్‌లలో సప్రెషన్ సిస్టమ్ , అన్ని కోచ్‌లలో అగ్ని ప్రమాద నివారణ లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు. లోకో పైలట్‌ల శిక్షణ సమయంలో క్రమం తప్పకుండా భద్రతపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రైళ్ల నిర్వహణ సమయంలో భద్రత అంశాలను క్షుణంగా పర్యవేక్షించాలని, సమయపాలనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎమ్.శ్రీకాంత్, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌పై పట్టు సాధించినప్పుడు మరిన్ని అవకాశాలు అందుకుంటారని కృష్ణ స్వరాజ్య రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ సీనియర్ సెక్యూరిటీ ఎనలిస్ట్ పీవీఎన్ రాఘవేంద్ర అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్ రంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తుందని చెప్పారు. అదే క్రమంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ అంశాల్లోనూ అనేక ఫిర్యాదులు, సమస్యలు పెరిగాయని తెలిపారు. అన్ని రంగాల్లోనూ వీటికి సంబంధించిన సమస్యలు విస్తృతం అవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా రంగాలకు సంబంధించిన నిపుణుల కొరత వెంటాడుతుందని వివరించారు. కంప్యూటర్ రంగంలోని విద్యార్థులు ఆ దిశగా దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, విభాగాధిపతి పి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం



మాట్లాడుతున్న గోళ్ళమూడి శేఖర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలతో బతుకు దుర్భరంగా మారుతుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని అన్నపూర్ణాదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. తెలిసో తెలియక మాదక ద్రవ్యాలకు అలవాటు చేసుకుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎటువంటి మత్తు పదార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమేనన్నారు. స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలకు ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలన్నారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ జాకబ్‌రాజు, నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్స్ ఓ శ్రావణ్‌కుమార్, ఈ వసంతకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శులు రమాదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించండి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల హక్కులపై అవగాహన, పరిరక్షణకు ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని.. ఈ నేపథ్యంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆ వివరాలను డిసెంబర్ 8వ తేదీలోగా తమ కార్యాలయంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల అవగాహనపై వీడియో, ఫొటోలతో పాటు సమగ్ర నివేదికను పంపితే వాటిలో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేస్తామన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం నాడు నిర్వహించే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ఉత్తమమైన వాటిని పంపిన వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. పౌర సరఫరాల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టం –2019పై షార్ట్‌ఫిల్మ్, ర్యాలీ, స్కిట్‌లు, ఇంటింటి ప్రచారం, ప్రదర్శనలు, ఎక్స్‌పో వంటివి నిర్వహించవచ్చన్నారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు సొంతగా లేదా వినియోగదారుల క్లబ్‌ల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించవచ్చని.. అయితే ఎంఈవో, స్కూల్ హెడ్‌మాస్టర్ నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు.

25 న యువ సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో 25 వ తేదీన సంగీత కళాశాలలో యువ సంగీత సమ్మేళనం నిర్వహిస్తునట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ సంగీత కళాకారులు మన సిజ, శ్రీ కృష్ణ వయోలిన్ కచేరి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ వీణా విద్వాంసురాలు సుశీలా గోపాలంను ఆత్మీయంగా సత్కరిస్తునట్లు తెలిపారు.

మద్యం కోసం వ్యక్తిపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం కోసం దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట రాజగిరి వారి వీధిలో ఎం. సూరిబాబు కుటుంబం నివాసం ఉంటుంది. సూరిబాబు అన్న సోమినాయుడు ఈ నెల 19వ తేదీన సొంత ఊరు నుంచి విజయవాడలో ఉంటున్న తమ్ముడి వద్దకు వచ్చాడు. సోమవారం రాత్రి సూరిబాబు, సోమినాయుడు మద్యం తాగేందుకు బార్‌కు వెళ్లారు. అయితే బార్‌లో వీరిద్దరికి తమ ఇంటి సమీపంలో ఉండే సాయి అనే వ్యక్తి వచ్చి మద్యం ఇప్పించాలని అడిగాడు. దీంతో సాయికి మద్యం ఇప్పించారు. ముగ్గురు కలిసి మద్యం తాగి బయటకు వచ్చారు. మరలా మద్యం కావాలని సాయి అడిగాడు. కానీ మద్యం ఇప్పించలేమని సూరిబాబు, సోమినాయుడు చెప్పారు. మద్యం అడిగితే ఇప్పించలేదంటూ సూరిబాబు, సోమినాయుడిని సాయి కొట్టడమే కాకుండా వెనక్కి నెట్టేశాడు. దీంతో సోమినాయుడు రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయం కావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే సోమినాయుడు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొనడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తేమశాతం సమర్థంగా నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి



కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం సమర్థంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి అన్నారు. మండలంలోని పునాదిపాడు, కోలవెన్ను రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం పరిశీలన తీరుపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతుల వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణ దగ్గర నుంచి తేమ శాతం నమోదు చేసి ధాన్యం సేకరించి మిల్లులకు తరలించే వరకూ బాధ్యతతో పని చేయాలన్నారు. రైతులకు మద్దతు ధర దక్కాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. తేమ శాతం పరిశీలనలో లోటుపాట్లు వల్ల రైతులకు మద్దతు ధర దక్కకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క రైతు నుంచి ధాన్యం సేకరించాలన్నారు. ఏడీఏ స్వర్ణలత, ఏఓ పిఎం.కిరణ్, వీఏఏలు కె.పావని, పవన్‌కల్యాణ్, కె.సురేష్ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ప్రభుత్వ కార్యాలయాల్లో దైనందిన విధులతోపాటు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సూచించారు. మొక్కల పెంపకం, పరిసరాల శుభ్రత వంటి చర్యల్లో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను మోడరన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సహకారం అందించాలని కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కలెక్టరేట్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తాము పనిచేసే కార్యాలయాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ప్రశాంతతో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో పచ్చదనం పెంపొందించేందుకు చేపట్టిన చర్యలు అభినందనీయమని తెలిపారు. కార్యాలయాల్లో భవిష్యత్‌కు ఉపయోగపడే మొక్కలను నాటి, పెంచాలన్నారు. కనువిందు చేసే పూల మొక్కలతో పాటు రావి, వేప, టేకు, మామిడి, నేరేడు తదితర మొక్కలను నాటితే ఫలాలతో పాటు నీడనిచ్చేందుకు దోహదపడతాయన్నారు. కలెక్టరేట్‌లోని మరుగుదొడ్లను పరిశీలించారు. స్త్రీ, పురుషుల మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఉండేలా తలపులకు ముందు అడ్డుగోడ నిర్మించాలని సూచించారు. ప్రైవసీ ఉండేలా చూడాలన్నారు. కలెక్టరేట్‌ను ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ ఆవరణ పరిశీలనలో కలెక్టర్ వెంట పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కలెక్టర్ వ్యక్తిగత కార్యదర్శి సతీష్ కుమార్ గార్డెన్ నిర్వాహకులు స్వామి, సిబ్బంది ఉన్నారు.

తాగి వాహనాలు నడిపితే జైలుకే

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా



డ్రంకెన్ పరీక్ష చేస్తున్న పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు ప్రతి వారం నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విజయవాడ నగరంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 1,326 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులలో 376 మందికి జైలు శిక్ష విధించడంతో బాటు, ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడ్డ వారిని న్యాయస్థానాల్లో హాజరుపర్చగా వారికి రూ. 1 కోటి 14 లక్షల 8 వేలు జరిమానాగా విధించాయన్నారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేయటానికి చట్ట పరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇక మీదట ట్రాఫిక్ పోలీసులతో పాటుగా లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నట్లుగా ఆయన తెలిపారు.

వైభవంగా షణ్ముఖుని నగరోత్సవం



స్వామి వారి నగరోత్సవంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నగరోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. కార్తిక మాస స్కంద షష్ఠీ కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి వివిధ వర్ణాలతో భక్తులు సమర్పించిన పలు రకాల పుష్పాలతో స్వామివారికి పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద పఠనంతో స్వామివారిని కీర్తించారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో, మంత్రోచ్ఛరణలతో కొండపై నుంచి బ్రాహ్మణవీధికి తీసుకొచ్చారు. అక్కడ అత్యంత సుందరంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై అధిష్టింపజేసి నగరోత్సవం చేశారు. ఉత్సవాన్ని స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బ్రాహ్మణవీధి రామాలయం నుంచి ప్రారంభమై నెహ్రూబొమ్మ సెంటర్, కోమలవిలాస్ సెంటర్, రమణయ్య కూల్ డ్రింక్‌షాప్ సెంటర్ సామారంగంచౌక్, శేషయ్య వీధి, కొత్తగుళ్లు, బ్రాహ్మణవీధి మీదుగా నగరోత్సవం ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బరావు పర్యవేక్షించారు.

ఏలూరు–విజయవాడ సెక్షన్‌లో తనిఖీలు



ప్యాంట్రీ కార్‌లో తనిఖీలు చేపడుతున్న డీసీఎం ఎండీ ఆలీఖాన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని కమర్షియల్ విభాగం మంగళవారం ఏలూరు–విజయవాడ సెక్షన్‌లోని పలు రైళ్లలో క్యాటరింగ్ తనిఖీలు చేపట్టారు. డీసీఎం ఎండీ ఆలీఖాన్ పర్యవేక్షణలో సిబ్బంది ఈ మార్గంలో 5 రైళ్లతో పాటు రెండు ప్యాంట్రీ కార్‌లలో భద్రత చర్యలపై తనిఖీలు చేపట్టారు. ఎల్‌హెచ్‌బి కోచ్‌లలో నిప్పులేని వంటలను మాత్రమే చేపట్టాలని ప్యాంట్రీ కార్ మేనేజర్‌లను సూచించారు. అదే విధంగా అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలు, ఫైర్ సేఫ్టీ అలారం పనితీరును పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లలో అధిక ధరల విక్రయాలపై విక్రేతలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో 11 మంది అనధికారిక విక్రయదారులు, 23 మంది టిక్కెట్ లేని ప్రయాణిల నుంచి రూ. 59,630 జరిమానా వసూలు చేశారు. రైళ్లు, స్టాల్స్‌లలో భద్రత అంశాలపై నిరంతరం పర్యవేక్షించాలని, స్టేషన్ ఆవరణలో అనధికార విక్రయాలు నిరోధించాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల రీ వెరిఫికేషన్



రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను అనుసరించి, ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారి ఓటర్లను తొలగించాలని, అలాగే ఓటర్ల రీ వెరిఫికేషన్ నిర్వహించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలని ఎటువంటి తప్పులు ఉండకూడదని అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నకిలీ ఓట్లను, శాశ్వతంగా మారిన ఓటర్లను గుర్తించి వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌వోలు ఫీల్డ్ సర్వే చేయాలని తెలిపారు. విజయవాడలో ఉన్న సెంట్రల్ నియోజకవర్గంలో అన్ని కేంద్రాల ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మల్లాది విష్ణు (వైఎస్సార్ సీపీ), ఎం.సాంబశివరావు (టీడీపీ), బి.రమణారావు (సీపీఎం), యస్. వీరేంద్ర రావు (సీపీఐ), యం. వినోద్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, జెడ్ సి–2 మల్యాద్రి, సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను, నార్త్ తహసీల్దార్ ఎం.మాధురి, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) కె. మోహన్‌రావు, ఏసీపీ–2 ఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.